
ఈనాడు నాగర్‌కర్నూల్
ఆదివారం అక్టోబరు 6, 2024

కుంటలు నిండగా.. పంటల 'పండగ'



మండల కేంద్రం కోడేరు చుట్టూ రెడ్డికుంట, సాయికుంట, కొప్పురాశికుంట, ఊరకుంట, బాపనికుంటలున్నాయి. దశాబ్దం క్రితం నీరు లేక కుంటలన్నీ కంపచెట్లతో కరవు కొట్టొచ్చినట్లు కనిపించేది. ఇటీవల భారీ వర్షాలు కురవడం, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో కాల్వల ద్వారా సాగునీరు వస్తుండటంతో కుంటలు జలకళ సంతరించుకున్నాయి. కుంటల పరిధిలోని భూములు సాగులోకి వచ్చి ఊరుచుట్టూ పచ్చని పైర్లతో కనువిందు చేస్తోంది. ఊరకుంట కింద పచ్చని పొలాలను 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

- న్యూస్‌టుడే, కోడేరు

పొలాల్లో కాసుల పంట

వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఓ గ్రామంలో ఒక గుంట స్థలానికి కూడా రిజిస్ట్రేషన్లు చేశారు. ఇక్కడ స్థిరాస్తి వ్యాపారానికి ఓ వ్యక్తి వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. నాలా(వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చే చట్టం) మార్చుకోకుండానే కడీలు పాతి ప్లాట్లుగా వేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం. అయినా గుంటల చొప్పున ఆ వెంచరు నిర్వాహకులు రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా పలువురికి ప్లాట్లను నిబంధనలకు విరుద్ధంగా విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మండలంలో వ్యవసాయ భూములకు ప్లాట్లుగా మార్చి గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామంలో 60 ఎకరాల్లో పెద్ద వెంచరు వేశారు. దీనిని నాలాగా మార్చలేదు. అయినా 121 చదరపు గజాల చొప్పున ప్లాట్లుగా మార్చి విక్రయానికి పెట్టారు. స్లాటు బుకింగ్ చేసుకుని ఒక్కొక్కరికి గుంట చొప్పున రిజిస్ట్రేషన్ చేశారు. వీరికి పట్టా పాసుపుస్తకాలూ వచ్చాయి. వాస్తవానికి ఇక్కడ వెంచరుగా అభివృద్ధి చేసిన నిర్వాహకులు వ్యవసాయ భూమిగా చూపించి రిజిస్ట్రేషన్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా స్థిరాస్తి వ్యాపారం



గోపాల్‌పేట మండలంలో వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చిన వైనం

ఈనాడు, మహబూబ్‌నగర్-న్యూస్‌టుడే, వనపర్తి వ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో పలు వ్యవసాయ భూములు వెంచర్లుగా మారుతున్నాయి. నాలాకు మార్చుకోకుండానే ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. డీటీసీపీ నుంచి అనుమతులు కూడా ఉండవు. స్థిరాస్తి వ్యాపారులు మాత్రం వ్యవసాయ భూములకు లేఅవుట్లు చేసి విక్రయిస్తున్నారు. సాధారణంగా వ్యవసాయేతర భూములకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయాలి. వ్యవసాయ భూములకు నాలా ధ్రువపత్రం లేకుంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయడం కుదరదు. ఈ భూములకు రెవెన్యూ కార్యాలయాల్లోనే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తకుండా గుంటల్లో వీటికి రిజిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత..

పాలమూరులో కొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత భూముల ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లా కేంద్రాల సమీపంలో వ్యవసాయ భూములు వెంచర్లుగా మారాయి. హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ఉన్న బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూరు, మూసాపేట, అడ్డాకుల, కొత్తకోట, పెబ్బేరు, ఎర్రవల్లి, ఇటిక్యాల, మానవపాడు, ఉండవల్లి మండలాల్లో పలుచోట్ల వ్యవసాయ భూములు వెంచర్లుగా మారాయి. కల్వకుర్తి నుంచి రాయచూరుకు వెళ్లే జాతీయ రహదారిలోని కల్వకుర్తి, మిడ్జిల్, మహబూబ్‌నగర్ అర్బన్, మహబూనగర్ గ్రామీణం, దేవరకద్ర, మరికల్, మక్తల్, మాగనూరు, కృష్ణా మండలాల్లోనూ వ్యవసాయ భూముల్లో పాట్లు వెలిశాయి. చాలాచోట్ల వీటిని వ్యవసాయేతర భూములుగా మార్చుకోవడం లేదు. గుంటల పేరుతో యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లను చేస్తున్నారు.

నిబంధనలు చెబుతున్నా..

వ్యవసాయ భూములకు గుంట నుంచి 10 గుంటల మధ్య స్లాటు బుక్ చేసి రిజిస్ట్రేషన్లకు రెవెన్యూ కార్యాలయాలకు వస్తే దీనిపై విచారణ జరిపించాలి. తండ్రి లేదా తల్లికి ఎకరా స్థలం ఉండి వారికి ఎక్కువ మంది సంతానం ఉంటే (కుటుంబ సభ్యులకు) మాత్రం రిజిస్ట్రేషన్లు చేయవచ్చు. సంబంధం లేని వ్యక్తులు నిత్యం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు స్లాటు బుక్ చేస్తే తహసీల్దార్‌కు అనుమానం రావాలి. ఈ సర్వే నంబరులో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి. అక్కడ స్థిరాస్తి వ్యాపారాలు చేస్తున్నారా విచారణ చేయాలి. చాలాచోట్ల ఇవేమీ చేయడం లేదు. స్థిరాస్తి వ్యాపారమని తెలిసి కూడా వ్యవసాయ భూములకు గుంటల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఎకరాకు 40 గుంటలు ఉంటుంది.. ఒక గుంటకు 121 చదరపు గజాలు ఉంటాయి. ఇలా గుంటల్లో పాట్లుగా చేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. దీనిపై మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోహన్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ భూములను కుటుంబసభ్యులకు మినహాయించి ఇతరుల పేరు మీద ఐదు గుంటల వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయకూడదు. ఇతరుల పేరు మీద స్లాటు బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ల కోసం వస్తే తహసీల్దారు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

పండ్ల తోటల సాగు లక్ష్యం నెరవేరేనా?



అమ్రాబాద్ : జంగంరెడ్డిపల్లిలో నాటిన మామిడి మొక్కలు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో పండ్ల ధరలు సామాన్యులకు భారంగా మారాయి. సమస్యను అధిగమించి పండ్ల తోటల సాగును పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినా.. క్షేత్రస్థాయిలో లక్ష్యం నెరవేరడం లేదు. నీటి వనరులు, తోటల సాగుకు అనుకూలమైన నేలలు ఉన్న చోట ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టాలని నిర్ణయించారు. జిల్లాల వారీగా సాగు లక్ష్యాన్ని నిర్దేశించారు. అధికారులు చొరవ చూపి రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తేనే పథకం ప్రయోజనం ప్రయోజనం నెరవేరనుంది.

ఉపాధిహామీ నిధులు..

ఉపాధిహామీ పథకంలో తోటల సాగుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. సన్న, చిన్న కారు రైతులకు రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. ఈ పథకం ద్వారా తోటల సాగు చేపడితే మూడేళ్ల తోటల సంరక్షణ బాధ్యతను ప్రభుత్వమే చూస్తోంది. ఒక్కో మొక్కకు రూ. 20 నుంచి రూ. 44 చొప్పున చెల్లిస్తుంది. ఉపాధిహామీ కూలీలతో గుంతలు తీసి, మొక్కలు నాటిస్తుంది. నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే చూస్తుంది.

2024లో వెయ్యి ఎకరాల సాగు లక్ష్యం

నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా 2024 సంవత్సరంలో వెయ్యి ఎకరాల సాగు లక్ష్యాన్ని నిర్దేశించారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు కేవలం 154 ఎకరాల్లో మాత్రమే మామిడి, నిమ్మ, కొబ్బరి వంటి పండ్ల మొక్కలు నాటడం పూర్తి చేశారు. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అనువైన స్థలాన్ని గుర్తిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జాబ్‌కార్డు కలిగిన చిన్న, సన్నకారు రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మొక్కల కొనుగోలు నుంచి నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. రైతులు తోటల పెంపకానికి ముందుకు వస్తే వెంటనే మంజూరు చేస్తాం. లక్ష్యాన్ని త్వరలోనే పూర్తి చేస్తాం.

- ఓబులేసు, డీఆర్‌డీవో

జిల్లా వ్యాప్తంగా.. **34,371** వివిధ రకాల పండ్ల తోటలు ఎకరాల్లో.. **13,390** రైతులు



అలంకరణలో అమ్మవారు

చంద్రఘంటాదేవిగా జోగులాంబ

అలంపూర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు అలంపూర్ ఆలయాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు జోగులాంబ భక్తులకు చంద్రఘంటాదేవి అలంకరణలో నేత్రపర్వంగా దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారికి అభిషేకం, స్పర్శదర్శనం, జోగులాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలో ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు.

క్రమబద్ధీకరణకు ఎదురుచూపులు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జిల్లాలో 2020లో నియామకమైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్నారు. ఇతర జిల్లాల్లోని కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేయగా నాగర్‌కర్నూల్ జిల్లాలో చర్యలు చేపట్టకపోవడంతో తాము సర్వీస్‌లో వారి కంటే జూనియర్లుగా మిగిలిపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. 2020 ఏప్రిల్‌లో ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేసింది. మూడేళ్ల ప్రొహిబిషన్ అనంతరం క్రమబద్ధీకరించనున్నట్లు అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. 2023 ఏప్రిల్ ప్రొహిబిషన్ గడువు ముగిసింది. తర్వాత జాప్యం చేస్తూ వచ్చారు. ఎన్నికల కోడ్ ఉందని మళ్లీ వాయిదా వేశారు. ఈ ఏడాది కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మాత్రం ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. గతేడాది నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్‌లను కలిసి పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రాలు అందజేశారు. ఈ ఏడాది జులైలో ప్రస్తుత కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. నెలల తరబడి ఆలస్యం చేస్తుండటంతో కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో రెండు నెలల క్రితం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2020లో నియామకమైన 27 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు.



కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

మూడు రోజుల్లో ఉత్తర్వులిస్తాం.. : 2020లో నియామకమైన పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేయాల్సి ఉంది. ఆ ప్రక్రియ పూర్తయింది. రెండు, మూడు రోజుల్లోనే అందరికీ ఉత్తర్వుల ప్రతులు జారీ చేస్తాం.

- రామ్మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి

ఘనంగా బతుకమ్మ సంబురాలు

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని కోర్టు ఆవరణంలో శనివారం న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రాజేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ సివిల్ న్యాయమూర్తి జి. సబిత, జూనియర్ సివిల్ న్యాయమూర్తి మౌనిక పూజలు చేసి బతుకమ్మ ఆడారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలను విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాధవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.





నాగర్‌కర్నూల్ : కోర్టు ఆవరణలో బతుకమ్మలతో సీనియర్ సివిల్ న్యాయమూర్తి జి. సబిత, జూనియర్ సివిల్ న్యాయమూర్తి మౌనిక.. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వద్ద అధ్యాపకులు

విద్యార్థులకు మళ్లీ రాగి జావ

కార్యక్రమాన్ని తిరిగి అమలు చేసేలా ఉత్తర్వులు



రాగిజావ తాగుతున్న విద్యార్థులు(పాతచిత్రం)

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే: ఉదయం వేళ విద్యార్థుల ఆకలి తీర్చేందుకు, పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని గత విద్యా సంవత్సరం ప్రారంభించింది. ఈ విద్యా సంవత్సరం జూన్ మాసం వరకు ఈ కార్యక్రమం కొనసాగగా, మూడు నెలలుగా ఆగిపోయింది. రాగి జావ అందించడం వల్ల మంచి ఫలితాలున్నాయని భావించిన ప్రభుత్వం ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని నిర్ణయించింది. తాజాగా పీఎం పోషణ్ పథకంలో భాగంగా సర్కారు పాఠశాలల్లోనూ తిరిగి ప్రారంభించాలని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. దీంతో దసరా సెలవుల అనంతరం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జావ అందనుంది.

వారంలో మూడు రోజులు: ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,227 ప్రభుత్వ పాఠశాలలుంటే 1 నుంచి 10వ తరగతి వరకు మూడు లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వీటితో పాటు ఉదయం వేళ వంట ఏజెన్సీల ద్వారా రాగిజావ కూడా అందించనున్నారు. దీంతో ఉదయం వేళ ఆహారం తీసుకోకుండా వచ్చే విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, బెల్లంతో కలిపి మరగబెట్టిన జావను వారంలో మూడు రోజుల పాటు అందించనున్నారు. ఇదిలా ఉండగా గతేడాది రాగి జావ పథకం విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందలేదు. శ్రమకు తగిన ఫలితం లేదంటూ వంట ఏజెన్సీలు మొరాయించడం, పిండి, బెల్లం సరఫరా చేయడంలో జాప్యం జరగడంతో కొన్ని చోట్ల తరచూ జావ అందించడంలో అంతరాయం ఏర్పడేది. అలాంటి ఇబ్బందులను అధిగమించి విద్యార్థులకు నిరంతరాయంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
మహబూబ్‌నగర్	859	61,656
నాగర్‌కర్నూల్	848	71,689
వనపర్తి	537	42,841
నారాయణపేట	511	59,870
జోగులాంబ	472	65,635

ఆదేశాల ప్రకారం అమలు : రాగి జావ అందించాలని ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వం నుంచి అవసరమైన పిండి, బెల్లం సరఫరా కాగానే పాఠశాలలకు చేరవేసి, అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం. రాగి జావ విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం. ఫలితంగా వారిలో చురుకుదనం పెరుగుతుంది.

-రవీందర్, డీఈవో, గద్వాల

పంపుహౌస్ వద్ద విద్యుత్తు పనులపై ఆరా



కుమ్మెర పంపుహౌస్ వద్ద విద్యుత్తు పనులను పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ సలహాదారుడు పెంటారెడ్డి, అధికారులు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : మండలంలోని కుమ్మెర వద్ద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపుహౌస్ వద్ద సబ్‌స్టేషన్ పనులను అధికారులు పరిశీలించారు. శనివారం పంపుహౌస్ వద్ద నీటిపారుదల శాఖ సలహాదారుడు పెంటారెడ్డి, నీటిపారుదల శాఖ సీఈ విజయ భాస్కర్ రెడ్డి, ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ మాణిక్యరావు, ఐబీ ఈఈలు పార్థసారథి, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి ఆరా తీశారు. సబ్‌స్టేషన్ ప్రారంభించారు. పంపుహౌజ్‌లోకి నీళ్లు రావడంతో విద్యుత్తు సబ్‌స్టేషన్ పనులను వేగంగా పూర్తి చేశామన్నారు. పంపుహౌస్‌లోని నీటిని తోడివేశామన్నారు. ప్రస్తుతం టన్నెల్‌లో ఉన్న నీటిని తోడివేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

పర్యాటక ప్రాంతాల పరిశీలన

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ ప్రాంతంలో పర్యాటకానికి అనుకూలంగా ప్రదేశాలను పరిశీలించినట్లు పర్యాటక శాఖ అధికారి రాజు, డీఈ శ్రీనివాసులు తెలిపారు. శనివారం కొల్లాపూర్ మండలంలోని వివిధప్రాంతాలను, అమరగిరిని సందర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావుకు నివేదికను సమర్పిస్తామని చెప్పారు. అధికారి కల్వరాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి, న్యూస్‌టుడే : పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరం వద్ద కృష్ణానది మధ్యలో పెద్దగుట్ట (ఐల్యాండ్)ను రాష్ట్ర పర్యాటక బృందం శనివారం గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు పరిశీలించినట్లు పేర్కొన్నారు. జటప్రోల్, మంచాలకట్ట గ్రామాల్లో పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి లభిస్తుందని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నరసింహ, రవి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అమరగిరి ప్రాంతంలోని కృష్ణానదిలో పర్యటిస్తున్న అధికారులు

రెజ్లింగ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



మహబూబ్‌నగర్ జట్టుకు బహుమతిని అందజేస్తున్న డీవైఎస్‌వో వెంకటేశ్ గుప్తా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు తదితరులు

ధన్వాడ, న్యూస్‌టుడే: క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని నారాయణపేట డీవైఎస్‌వో వెంకటేశ్ గుప్తా అన్నారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ పోటీలు శనివారం ముగిశాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు మాటాడారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అండర్ 14 విభాగంలో 30 కిలోలకు సంబంధించి నందిని (మహబూబ్‌నగర్), 33 కిలోల విభాగంలో నిఖిత (మహబూబ్‌నగర్), 36 కిలోల విభాగంలో సీతామహలక్ష్మి (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. 39 కిలోల విభాగంలో శిరీష (మహబూబ్‌నగర్), 42 కిలోల విభాగంలో ప్రియమణి (మహబూబ్‌నగర్), 46 కిలోల విభాగంలో మౌనిక (మహబూబ్‌నగర్), 62 కిలోల విభాగంలో నైతిక (ఆదిలాబాద్), కీర్తి (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. 69 కిలోల విభాగంలో శివరంజని (మహబూబ్‌నగర్), శ్రుతి (కరీంనగర్), 73 కిలోల విభాగంలో సింధు (నిజామాబాద్), సఫూరాలు (మహబూబ్‌నగర్) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 50 కిలోల విభాగంలో రజిత (మహబూబ్‌నగర్), అక్షయ (మెదక్), మొదటి స్థానం సాధించిన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

అండర్-19 క్రికెట్ పోటీల రన్నర్స్‌గా పాలమూరు



రన్నరప్ ట్రోఫీతో జిల్లా క్రికెటర్లు, ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఫైనల్లో కరీంనగర్ చేతిలో 2 వికెట్ల తేడాతో ఓడి రెండో స్థానం దక్కించుకుంది. శనివారం వరంగల్‌లోని వేంకటేశ్వర మైదానంలో నిర్వహించిన తుది పోరులో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. షాదాబ్ అహ్మద్ 89 (99 బంతుల్లో 4×11, 6×3), అబ్దుల్ రాఫె 48, అంకిత్ రాయ్ 31 పరుగులు చేశారు. అనంతరం కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసి విజయం సాధించింది. జిల్లా జట్టు నుంచి ముఖీత్ 3, షాదాబ్ 2, శశాంక్ 1 వికెట్ తీశారు. రన్నర్స్‌గా నిలిచిన పాలమూరు జట్టుకు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి శ్రీనివాస్, మహబూబ్‌నగర్ క్రికెట్ సంఘం కార్యదర్శి ఎం.రాజశేఖర్ ట్రోఫీ బహూకరించారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం ప్రతినిధులు ఉదయ్ భాను రావు, ప్రవీణ్, అబ్దుల్లా, శివశంకర్ తదితరులు హాజరయ్యారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



విజేత మహబూబ్‌నగర్ జట్టుతో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు తదితరులు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడా సామర్థ్యం పెంపొందించుకోవడంతో చదువుతో పాటు దేశ కీర్తి ప్రతిష్ఠలు పెంపొందించవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్ కుమార్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు కోస్గిలో మూడు రోజుల పాటు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు, అనంతరం బాలికల విభాగంలో ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్ జట్లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్ పర్సన్ కోడిగంటి అన్నపూర్ణ తదితరులున్నారు.

చుట్టేద్దాం.. చూసొద్దాం

- తెలంగాణ దర్శినికి సర్కారు శ్రీకారం
- 3వేల మంది పాలమూరు విద్యార్థులకు అవకాశం

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఉరిమే ఉత్సాహం.. కొత్త ప్రాంతాలు పర్యటించాలన్న ఆసక్తి మెండుగా ఉన్న విద్యార్థులకు శుభవార్త. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయి విద్యార్థులకు పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు నిర్ణయించింది. 'తెలంగాణ దర్శిని' శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పాఠశాల స్థాయిలో రెండో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ప్రభుత్వం రూ. 12.10 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల విద్యార్థులు ఈ పథకం కింద చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.

ఉమ్మడి జిల్లాకు రూ. 36 లక్షలు..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య, నిధులను త్వరలో ఖరారు చేయనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సుమారు 3 వేల మంది విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు రూ. 36 లక్షలు కేటాయించే అవకాశం ఉంది.

దసరా తర్వాత..

విద్యార్థులను విహార యాత్రకు తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఎకో టూరిజం, ఆర్ట్, క్రాఫ్ట్, వారసత్వం, సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దసరా సెలవుల తరువాత ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



క్షేత్ర పర్యటనలో ఉమామహేశ్వరం క్షేత్రం వద్ద విద్యార్థులు

తరగతుల వారీగా వివరాలు

విభాగం	తరగతులు	రోజులు	దూరం (కి.మీ.లలో)	ఒక్కో విద్యార్థికి ఖర్చు (రూ.లలో)
ఒకటి	2-4	ఒక రోజు	స్థానికం (మండల పరిధి)	300
రెండు	5-8	ఒక రోజు	20-30	800
మూడు	9-ఇంటర్	రెండు రోజులు	50-70	2,000
నాలుగు	డిగ్రీ	నాలుగు రోజులు	రాష్ట్రం	4,000

తరగతుల వారీగా విభాగాలు

విద్యార్థులు చదువుతున్న తరగతులను పరిగణనలోకి తీసుకొని నాలుగు విభాగాలుగా విభజించారు. మొదటి విభాగంలో 2-4 తరగతుల విద్యార్థులను గ్రామం లేదా మండల పరిధిలోని స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు, ఉద్యానాలను సందర్శించేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలి. రెండో విభాగంలో 5-8 తరగతుల విద్యార్థులు 20 కిలోమీటర్ల నుంచి 30 కి.మీ. పరిధిలోని ప్రదేశాలను సందర్శించేందుకు అవకాశం కల్పించారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులు 50-70 కి.మీ. పరిధిలో ఉన్న ప్రదేశాలను రెండు రోజుల పాటు సందర్శించవచ్చు. డిగ్రీ విద్యార్థులు నాలుగు రోజుల పాటు పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ప్రణాళికలు రూపొందించారు. సొంత జిల్లా వెలుపల లేదా రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా పర్యటించి పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు అవకాశం కల్పించారు.

వారసత్వ సంపద కాపాడుకుందాం..

తెలంగాణ దర్శిని కార్యక్రమం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించనుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోనున్నారు. వారసత్వ సంపదను కాపాడుకోవడంలో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని విద్యార్థులు పర్యాటక ప్రదేశాలు సందర్శించేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నాం.

-డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూలు

రామ రామ ఉయ్యాలో..!



పాలమూరు రెడ్డిసేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్ పట్టణం బీకే రెడ్డికాలనిలోని రెడ్డి బాలికల వసతిగృహంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సతీమణి లక్ష్మీప్రసన్న, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, మహిళా విభాగం ప్రతినిధులు వేడుకల్లో పాల్గొని బతుకమ్మలకు పూజలు చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు.

- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ గ్రామీణం

ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ: విమలక్క



బతుకమ్మతో విమలక్క

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : ప్రకృతి, స్త్రీలను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని ప్రజా గాయకురాలు విమలక్క అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం చెన్నారంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళలు, చిన్నారులతో కలిసి బహుజన బతుకమ్మ వేశారు. నల్లమల ప్రాంతంలో 2014కు ముందు యురేనియం తవ్వకాలకు నిరసనగా ప్రజా ఉద్యమాలు చేసినట్లు గుర్తుచేశారు. రామగుండాన్ని కాపాడుకోవడం కోసం నినదిస్తున్న ఈ బహుజన బతుకమ్మ తిరిగి 6న తిరిగి రామగుండం వెళ్తుందన్నారు. స్త్రీల హక్కులు, మద్యం నిషేధం, కుల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచించారు. బహుజన బతుకమ్మను గ్రామ గ్రామాన జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాశన్నయాదవ్, పరమేశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం.. ఒకరి దుర్మరణం

ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్..



మృతదేహాన్ని వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల కొత్త బస్టాండు వద్ద జాతీయ రహదారి-44పై ఫ్లైఓవర్‌పై శనివారం అర్ధరాత్రి తర్వాత 1.30 గంటలకు రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి(45) అక్కడికక్కడే మృతిచెందగా మరో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఉత్తరాది నుంచి ఇక్కడికి పనికి వచ్చిన ఇద్దరు కార్మికులు

మరొకరి పరిస్థితి విషమం

ఫ్లైఓవర్‌పై నుంచి నడుస్తూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా అందులో ఒకరు మృతిచెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాయపడిన వృద్ధుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడు, క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేస్తామని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

సీఎం స్వగ్రామంలో ఏర్పాట్లు



కొండారెడ్డిపల్లిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఎం ఓఎస్డీ చక్రవర్తిరెడ్డి, సీఎం సోదరుడు కృష్ణారెడ్డి

వంగూరు, న్యూస్‌టుడే : దసరా పండగకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి రానుండటంతో జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం ఓఎస్డీ చక్రవర్తిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయం, ఏఎస్పీ రామేశ్వర్, ఏఆర్ ఏఎస్పీ భరత్, సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి తదితరులు శనివారం కొండారెడ్డిపల్లిని సందర్శించి మాట్లాడారు. సీఎం ప్రారంభించనున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సౌర ప్రాజెక్టులో భాగంగా సౌర పలకలను రెడ్‌కో, విద్యుత్తుశాఖాధికారులు వేగవంతంగా ఏర్పాటు చేయాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున అధికారులు యుద్ధప్రాతిపాదికన పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం సీఎం నివాసంలో సమావేశమై సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాట్లకు ప్రణాళిక రూపొందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ చిన్నఓబులేశ్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై మహేందర్, పంచాయతీరాజ్ డీఈ చంద్రకళ, ఏఈ మహిపాల్‌నాయక్, ఎంపీడీవో విజయభాస్కర్, ఏవో తనూజరాజ్, నాయకులు వేమారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకల్లో సీఎం సతీమణి



ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను మూడో రోజు కనుల పండువగా కొనసాగాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భార్య గీతారెడ్డి హాజరయ్యారు. ఆలయకమిటీ అధ్యక్షుడు రమేష్‌బాబు, సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఆమె ఆలయ అభివృద్ధికి రూ. లక్ష నగదు విరాళం అందజేశారు.

ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

వంగూరు, న్యూస్‌టుడే : వచ్చే నెల నవంబర్ 20లోపు ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి అన్నారు. సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో రూ. 2కోట్లతో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సీఎం స్వయంగా రూ. 2కోట్లు వెచ్చించి ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం చేపట్టారని, అందుకోసమే నాణ్యతగా పనులు చేయించాలని గుత్తేదారుని కోరారు. నవంబర్‌లో విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఈ కార్యక్రమానికి సీఎం హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీఎం సోదరి సుమతమ్మ, సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, నాయకులు వేమారెడ్డి, పండిత్‌రావు, కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుజీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00








లింగాల: అన్నపూర్ణాదేవికి చిన్నారుల పూజలు.. ● అచ్చంపేట: వంకేశ్వరంలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మ వారికి అలంకరణ.. ● కొల్లాపూర్: కన్యకా పరమేశ్వరాలయంలో గజలక్ష్మి అవతారంలో అమ్మవారు.. ● తిమ్మాజిపేట: బావాజిపల్లిలో అమ్మవారి పూజా కార్యక్రమంలో భక్తులు ● తిమ్మాజిపేటలో



వెల్దండలో బుధవార్ పేట ఆంజనేయస్వామి ఆలయంలోని దుర్గామాతకు పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ ఆలయాల్లో దుర్గామాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. శనివారం అమ్మవారి మండపాల్లో కుంకుమార్చనలు, పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.
- న్యూస్‌టుడే, బృందం

శక్తి స్వరూపిణీ.. ముక్తి ప్రదాయిని





కొల్లాపూర్: అంబేడ్కర్ కాలనీలో... అచ్చంపేట: అయ్యప్ప స్వామి దేవాలయంలో...అచ్చంపేట: వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు అచ్చంపేట: అన్నపూర్ణాదేవికి 108 రకాల ప్రసాదాల నివేదన

ఘనంగా బతుకమ్మ సంబురాలు




బతుకమ్మను పేర్చుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు.. బతుకమ్మలతో విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుమ్మలను తయారు చేసుకుని వచ్చారు. కళాశాల ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ.. ఆడారు. అధ్యాపకులు పూలపండుగ ప్రాధాన్యం వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాంరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : తిమ్మాజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మను పేర్చి పాటలు పాడుతూ.. దాండియా ఆడారు. రెండు గంటలపాటు నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులు ఆటపాటలతో అలరించారు.

తాడూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని కూచుకుళ్లసౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు స్వయంగా బతుకమ్మలను పేర్చి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

తల్లిదండ్రుల బాధ్యత మనదే



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి కుటుంబ సభ్యునిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, వృద్ధులకు చట్టాలు రక్షణగా ఉన్నాయన్నారు. ఎలాంటి సమస్యలున్నా జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు చెప్పుకోవచ్చని సూచించారు. తల్లిదండ్రులను మనం మంచిగా చూసుకున్నప్పుడే మన్నల్ని మన పిల్లలు అదేవిధంగా చూసుకుంటారన్నారు. కార్యక్రమంలో వృద్ధుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శ్రీనివాసులు, రవి శంకర్, వృద్ధాశ్రమ నిర్వహకులు సీడీపీవోలు పాల్గొన్నారు.

శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని నందివడ్డెమాన్‌లోని జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో శనీశ్వరునికి తిల, తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పరమశివునికి రుద్రాభిషేకం, అర్చనలు చేశారు.



శనీశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బాల్యమిత్రులను ఆదుకుంటాం

లింగాల, న్యూస్‌టుడే : ఆర్థికంగా వెనుకబడిన పేద బాల్య మిత్రుల కుటుంబాలను ఆదుకుంటామని పూర్వవిద్యార్థుల పేర్కొన్నారు. లింగాల ఉన్నత పాఠశాలలో 2011-2012 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను శాలువలతో సన్మానించారు. ఉపాధ్యాయులు అనురాధ, శ్యాంసుందర్ గౌడ్, పాండు, గజేంద్ర శ్రీనివాస్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలివ్వాలి

తెలకపల్లి, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాలు వెంటనే విడుదల చేయాలని, జినుకుంట దగ్గర మూతపడిన లెదర్ పార్కును తిరిగి ప్రారంభించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రం ప్రధాన కూడలిలో శనివారం సంఘం ఆవిర్భావ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో నేటికి కులవివక్ష కొనసాగుతుండటం దారుణమన్నారు. మండలాధ్యక్షుడు కొంగరి కాశన్న, రమేశ్, భాస్కర్, వెంకటయ్య, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

గీత కార్మికుల ప్రాణాలను రక్షించేందుకే కిట్లు

చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే: గీత కార్మికులు వృత్తి నిర్వహణలో ప్రమాదాల బారిన పడకుండా ప్రాణాలను రక్షించేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్లను అందజేయనుందని ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం చారకొండ తాటి వనంలో వెల్దండ, కల్వకుర్తి, అచ్చంపేట, తెల్కపల్లి, నాగర్‌కర్నూల్ మండలాలకు చెందిన 150 మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. కార్మికులు కల్లు గీసే సమయంలో మెలకువలు పాటిస్తే ప్రాణాలు రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీరామ్, శిక్షకుడు జస్వంత్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాల్‌రామ్‌గౌడ్, నాయకులు వెంకట్‌గౌడ్, గణేశ్‌గౌడ్, శివగౌడ్, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గన్యాగులలో శనివారం కొత్తగా నిర్మించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ముదిరాజ్‌లకు ఉపాధి కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి

ఊరగుట్టను తవ్వేస్తున్నారు...

యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు




తవ్విన ప్రదేశం. ● మట్టి తవ్వడంతో పల్లె ప్రకృతి బోర్డు కిందపడిన దైనం

కోడేరు, కొల్లాపూర్, న్యూస్‌టుడే : కోడేరు ప్రాంతంలో ఎక్కడ రహదారులు వేసినా, వెంచర్లు చేసినా వాటికి ఊరగుట్ట(బలుసుపాల గుట్ట) నుంచే ఎర్రమట్టి తరలిస్తున్నారు. ఇంటి నిర్మాణాల్లో, రైతుల పొలాలకు వెళ్లే దారులకు ఇక్కడి నుంచే మట్టి తోడేస్తున్నారు. ఈ అక్రమ మట్టి తరలింపుతో గుట్ట క్రమేణా ఆక్రమణకు గురవుతోంది. వ్యాపారస్తులు యథేచ్ఛగా ఈ దందా కొనసాగిస్తున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదని గ్రామస్థులు చెబుతున్నారు.

చుట్టూ గుంతలే...: కోడేరు ఊరగుట్ట సర్వే నంబరు 356లో దాదాపు 75 ఎకరాల్లో ఉంది. దీనికి అనుసరించి ఇప్పటికే ఆదర్శ పాఠశాల, బాలికల వసతి గృహం, రైతువేదిక, వ్యవసాయ గోదాములను నిర్మించారు. వీటి నిర్మాణాలతో గుట్ట ముందు భాగం సగం వరకు తవ్వారు. గత ప్రభుత్వంలో ఇదే గుట్టపై పది ఎకరాల్లో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. వ్యాపారులు అక్కడ మొక్కలను తొలగించి, తవ్వకాలు చేపట్టారు. గుట్ట వెనుక భాగంలో అయితే ఏకంగా మామిడి తోటను నాటారు. వీటిని ఆపాలని కోడేరు కొంతమంది గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌తో పాటు మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

నాయకుల సహకారంతో

గ్రామంలో దాదాపు 60 ట్రాక్టర్లు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వాటి యజమానులకు అప్పటి నాయకులు మట్టి తవ్వుకోవడానికి సహకరించారు. ఇదే తంతు ఇప్పటికీ కొనసాగుతోంది. ఈనెల ప్రారంభం నుంచి దాదాపు 40 ట్రాక్టర్లు రెండు పొక్లెయిన్లు ఏర్పాటు చేసి మట్టి తరలిస్తున్నారు. ఇటీవల తహసీల్దార్ విజయ్‌కుమార్ పోలీసుల సహాయంతో ట్రాక్టర్లను నిలిపివేసినా నేతల ఒత్తిడితో తిరిగి వదిలేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

చర్యలు తప్పవు...: ప్రభుత్వ భూములు, గుట్టలపై అనుమతులు లేకుండా మట్టి తవ్వితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. అయితే గుట్టను పెద్ద ఎత్తున తవ్వుతున్న విషయం మా దృష్టికి రాలేదు. సిబ్బందితో పర్యవేక్షణ చేయించి, రక్షణ చర్యలు చేపడుతాం. **- విజయ్‌కుమార్, తహసీల్దార్, కోడేరు**

అభివృద్ధి పనులకు ప్రత్యేక చర్యలు

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పురపాలిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. అచ్చంపేట పుర కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యవసర అభివృద్ధి పనుల కోసం రూ.39 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కోనేరు మరమ్మతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నూతన పాలకవర్గంతో సమీక్ష నిర్వహించారు. అంబేడ్కర్ ప్రజాభవన్‌లో డివిజన్ స్థాయి పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్నారు. గడ్డం వెంకటస్వామి జయంతిలో పాల్గొని నివాళులు అర్పించారు. పుర అధ్యక్షుడు శ్రీనివాసులు, కమిషనర్ శ్యాంసుందర్, మార్కెట్ ఛైర్ పర్సన్ రజిత పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాల అందజేత: అచ్చంపేట, న్యూస్‌టుడే : పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు పురస్కారాలతో పాటు పతకాలు, ప్రశంసా పత్రాలను క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపకుడు వాస రాఘవేందర్ శనివారం అందజేశారు. వీరితో పాటు ఎంఈవోలు, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు జీవన్‌కుమార్, విష్ణుమూర్తి, చంద్రశేఖర్, బషీర్ అహ్మద్, బచ్చు బాబు, బాలకిషన్, క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

అచ్చంపేట టౌన్ : అచ్చంపేటలో ఫ్రెండ్స్ క్లబ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను శనివారం ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు.

బొడ్రాయికి పూజలు

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని చంద్రకళలో కొత్త కాలనీలో ఉన్న బొడ్రాయి వద్ద గ్రామస్థులు శనివారం పూజలు నిర్వహించారు. రహదారికి అడ్డుగా ఉండడంతో హోమం చేసి మరోచోటకి మార్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి బాల్‌నరసింహ, నాయకులు లింగయ్య, కాశన్న, చిన్నబ్రహ్మయ్య, మశన్న, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
నాగర్‌కర్నూలు : 7993300530 కల్వకుర్తి : 9908803650
అచ్చంపేట : 8008573927 కొల్లాపూర్ : 8008573870

కొల్లాపూర్, న్యూస్‌టుడే :

? కొల్లాపూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలుస్తోంది. గడ్డి పెరిగి బురదమయం మారింది. - కుమార్

✔ వర్షపు నీరు కాల్వలోకి వెళ్లేలా చర్యలు చేపడుతాం. - శ్రీనివాసులు, కమిషనర్, కొల్లాపూర్ పురపాలిక

మురుగు దాటితేనే సార్లోల్ల దర్శనం!



ఉప్పునుంతల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం అధికారులు ఆ దారిలో రాకపోకలు సాగిస్తున్నారు. చర్యలు చేపట్టడం లేదు. ప్రధాన రహదారి నుంచి వర్షపు నీరంతా దిగువ వైపు నిల్వ ఉంటోంది. ఈ ప్రాంతంలో నీరు పోయే మార్గం లేక మురుగుగా మారి దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో తదితర కార్యాలయాలతో పాటు ఆస్పత్రికి వెళ్లే రోగులు అవస్థలు పడుతున్నారు. కాలువ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీరాజ్ డీఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ... వెంటనే పరిశీలించి పంచాయతీ నిధులతో మురుగు కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం

వంగూరు, న్యూస్‌టుడే : రైతు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని భాజపా జిల్లా నాయకుడు సంకబుడ్డి పరమేశ్ విమర్శించారు. మండలంలోని డిండిచింతపల్లిలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో 250 మందికి మాఫీ కాలేదని, కాంగ్రెస్ నాయకులు ఇసుక విక్రయానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మల్లేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

మత మార్పిడులకు వ్యతిరేకంగా పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మాతృశక్తి రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రామ్మోహన్‌రెడ్డి

అచ్చంపేట, న్యూస్‌టుడే : మత మార్పిడులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని మాతృశక్తి రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అచ్చంపేట అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. పేద హిందువులను మత మార్పిడులు చేయిస్తున్నారని ఆరోపించారు. దసరా ఉత్సవాల్లో దుర్గా వాహిని ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాతృశక్తి డివిజన్ కన్వీనర్ సునీతాబాయి, దుర్గా వాహిని ప్రముఖ్ సౌమ్యశ్రీ, వీహెచ్‌పీ ప్రతినిధులు తేజస్విని, హేమలత, శకుంతల, వేణుగోపాల్, సుధాకరయ్య, బాలాజీ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : మిషన్ భగీరథ నీరు సురక్షితం అని గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ హేమలత అన్నారు. శనివారం ఉప్పునుంతల రైతు వేదికలో నిర్వహించిన నీటి సరఫరా సహాయకుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంగూరు, న్యూస్‌టుడే : మిషన్ భగీరథ నీటి సరఫరా సహాయకులు బాధ్యతగా పనిచేయాలని మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రావు సూచించారు. వంగూరు రైతువేదికలో వంగూరు, చారకొండ మండలాలకు చెందిన సహాయకులకు శిక్షణకు సంబంధించి శనివారం ధ్రువీకరణ పత్రాలు అందజేసి మాట్లాడారు. గ్రిడ్ ఈఈ సుధాకర్‌సింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమణి, గ్రిడ్ ఏఈ రితేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని పెద్దాపూర్ స్టేజీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ప్రజా యుద్ధ నౌక గద్దర్ కూతురు వెన్నెల పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శనివారం గద్దర్ విగ్రహావిష్కరణకు వెళ్తూ ఆమె కొద్ది సేపు పెద్దాపూర్‌లో ఆగారు. గ్రామస్థులతో కొద్ది సేపు మాట్లాడారు. నాయకులు భిక్షపతి, కృష్ణ, ఎర్రయ్య, వెంకటయ్య, యాదగిరి, రమేశ్, బొబ్బిలి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ర్యాలీ

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : ఉత్తరప్రదేశ్‌లో ఓ స్వామీజీ మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో ముస్లిం ఐకాస ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పాలమూరు కూడలిలో దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఠాణాలో ఫిర్యాదు చేశారు.

ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహావిష్కరణ

అచ్చంపేట గ్రామీణం, అచ్చంపేట, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు కూడలిలో ఏర్పాటు చేసిన విప్లవ కవి, ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణతో కలిసి రచయిత ఆచార్య కంచ ఐలయ్య శనివారం ఆవిష్కరించారు. విగ్రహానికి పూలతో అభిషేకం చేసి ఘనంగా నివాళి అర్పించారు. ప్రజా గాయకురాలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధి విమలక్క కాగడా వెలిగించారు. గాయకుడు ఏపూరి సోమన్న, స్థానిక కళాకారులు ఆట పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, గద్దర్ కుమార్తె వెన్నెల, బాలబోయిన సుదర్శన్, పసునూరి రవీందర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మన్ననూరులో గద్దర్ విగ్రహావిష్కరణలో ఆచార్య కంచ ఐలయ్య, విమలక్క తదితరులు



మద్యం తాగి వాహనాలు నడపొద్దు



ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

కందనూలు, న్యూస్‌టుడే : వాహనచోదకులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కనకయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ప్రధాన రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాహనాలు జప్తు చేస్తామన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి జైలు పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై గోవర్ధన్, ట్రాఫిక్ ఎస్సై కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కందనూలు, న్యూస్‌టుడే : వనపట్లకు చెందిన పొన్నమ్మ (28) శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తల వెంట్రుకలకు వేసుకునే రంగు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. భర్త సాయిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

కారు బోల్తా.. ఒకరి మృతి



దశరథం

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కారు బోల్తాపడి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి గ్రామ గేటు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై హృషికేశ్ కథనం ప్రకారం... కొల్లాపూర్ పట్టణానికి చెందిన బిజ్జ దశరథం(55), స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వీఆర్ఏ మహేష్ నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్‌కు కారులో వస్తున్నారు. అంకిరావుపల్లి గేట్ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. వాహనం నడుపుతున్న దశరథం అక్కడిక్కడే మృతి చెందారు. మహేష్‌కు తలకు తీవ్ర గాయాలు కాగా నాగర్‌కర్నూల్..అటు నుంచి హైదరాబాద్ తరలించారు. దశరథంకు భార్య లక్ష్మి, కుమారుడు మనోహర్‌లు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రయాణ ప్రాంగణంలో వృద్ధుడి మృతి

కందనూలు, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన కొమ్ము వెంకటయ్య (70) భార్య వెంకటమ్మతో కలిసి శనివారం సాయంత్రం తాడూరు మండల కేంద్రానికి బయలుదేరారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రయాణ ప్రాంగణంలో కల్వకుర్తి బస్సు కోసం ఎదురుచూస్తుండగా వెంకటయ్య తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రయాణికులు సమాచారమివ్వడంతో 108 సిబ్బంది వచ్చి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు.

కూలిన ఇల్లు..

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : కల్వకోల్‌లో ప్రమాదవశాత్తు శనివారం ఓ ఇల్లు కూలింది. కుటుంబ సభ్యులు ఆ సమయంలో ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు సువర్ణ, శివలింగం కోరారు.

దుకాణంలో చోరీ

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీపురం ప్రధాన రహదారి పక్కన ఉన్న సాయిలుకు చెందిన రేకుల డబ్బా దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. డబ్బా వెనుక రంధ్రం చేసి చొరబడ్డారు. రూ. 60 వేల విలువైన సిగరెట్లు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేస్తున్నామని ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

వ్యాపారిపై వేధింపుల కేసు నమోదు

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: కులం పేరుతో దూషించిన ఓ వ్యాపారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన ఈదులపల్లి జంగయ్య ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2015లో ఇటాచి వాహనాన్ని తీసుకున్నారు. వాహనాన్ని వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం రేమద్దుల గ్రామానికి చెందిన కథల్‌కు అద్దెకు ఇచ్చారు. అద్దె చెల్లించకపోవడంతో పాటు వాహనాన్ని తిరిగి ఇవ్వలేదు. 23 సెప్టెంబర్‌న కల్వకుర్తి కోర్టు పనిమీద వచ్చిన కథల్‌ను వాహనం ఇవ్వాలని అడుగగా కులం పేరుతో దూషించినట్లు జంగయ్య ఫిర్యాదు చేశారు. ఈమేరకు శనివారం ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మైనింగ్ వ్యాపారిపై దాడి.. నలుగురిపై కేసు

కడ్తాల్ (ఆమనగల్లు), న్యూస్‌టుడే: వ్యాపారిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద శనివారం చోటుచేసుకుంది. కడ్తాల్ సీఐ శివప్రసాద్, వెల్దండ పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం రేమద్దులకు చెందిన పిట్ల కతాల్ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కడ్తాల్ మండలం సాలార్‌పూర్ శివారులో మైనింగ్ వ్యాపారం చేస్తున్నాడు. వెల్దండ మండలం చొక్కన్నపల్లికి చెందిన ఈదులపల్లి జంగయ్య తన ఇటాచీ యంత్రాన్ని కతాల్‌కు లీజుకు ఇచ్చారు. లీజు డబ్బులతో పాటు ఇటాచీ యంత్రాన్ని తిరిగి ఇవ్వకపోవడంతో జంగయ్య వెల్దండ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై శనివారం కతాల్ ఠాణాకు వెళ్లి తిరిగి వస్తుండగా.. కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కారుపై రాళ్లతో దాడి చేసి కారులో ఎక్కించుకుని కొట్టుకుంటూ వెల్దండ సమీపంలో వదిలేశారు. ప్రస్తుతం కతాల్ మాదాపూర్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బద్రియాదవ్, నిజాంతో పాటు మరో ఇద్దరు దాడికి పాల్పడ్డట్లు బాధితుడి కుమారుడు కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.